క్లుప్తంగా

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు



మడికొండ: వైశాఖ పంచమి, ఆరుద్ర నక్షత్రం, ఆదిశంకరాచార్య జయంతిని పురస్కరించుకొని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో మెట్టు రామలింగేశ్వరస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి ఆదివారం రుద్రాభిషేకం, లక్ష పుష్పార్చన చేశారు. పూజా కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, వస్కుల ఉమ, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, భక్తులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శ్వేతార్క ఆలయంలో పుత్రకామేష్టి యాగం



కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఆదివారం పుత్ర కామేష్టి యాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక యాగశాలలో పుత్రకామేష్టి యాగం చేశారు. పిల్లలు కావాలని ఆకాంక్షిస్తూ దాదాపు వంద జంటలు యాగంలో పాల్గొన్నాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పాయసం వండి భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం దేవాలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పరిపాలన అధికారి సాయికృష్ణ శర్మ, ఆలయ ఇన్‌చార్జ్ చొక్కారపు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో ఆది శంకరాచార్య జయంతి



కాశిబుగ్గ: జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతిని వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో సోమవారం నిర్వహించారు. ఆలయంలోని శంకరాచార్యుల చిత్రపటానికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శంకరాచార్యుల గొప్పదనాన్ని, విశిష్టతను వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరన్నకు సన్మానం



ఖిలా వరంగల్: భద్రకాళి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వరంగల్‌లోని భద్రకాళి భద్రేశ్వరుడి కల్యాణ మహోత్సవానికి తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరన్న ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పెరక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు దిడ్డి నరేందర్, జిల్లా అధ్యక్షుడు వడ్డె రవీందర్, అచ్చ వినోద్‌కుమార్ సన్మానించారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, మల్లేశ్వర్, సుంచు కట్టమల్లు, చింతం యాదగిరి, లక్ష్మీనారాయణ, వీరన్న, శంకరయ్య, శ్రీను, రాజేష్, అల్లం రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ముచ్చర్లలోని పారిశుద్ధ్య కార్మికులు, ఆశ వర్కర్లకు చీరలు పంపిణీ చేశారు. చల్లా పూలమ్మ జ్ఞాపకార్థం సాయి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు వెంకటేశ్వర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, స్థానికులు శ్రీధర్, రాజేష్, ప్రమోద్ పాల్గొన్నారు.

ఓటు వేస్తేనే ప్రశ్నించే హక్కు

వరంగల్: ప్రశ్నించే హక్కు కావాలంటే ఓటు వేయాలని, ఓటు వేయని వారికి ఏది అడిగే హక్కు, అనుభవించే హక్కు లేదని ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ నేషనల్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అనితారెడ్డి ఒక ప్రటనలో తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని, అది తమ బాధ్యత అని పేర్కొన్నారు.

ఉపాధి హామీ పథకంలో గోల్‌మాల్

- అంతా ఫీల్డ్ అసిస్టెంట్ల ఇష్టారాజ్యం
- ఉపాధి పనుల్లో పర్యవేక్షణ లోపం
- క్షేత్రస్థాయికి వెళ్లని పంచాయతీ కార్యదర్శులు
- పనులు చేయని వారి ఖాతాల్లో డబ్బులు జమ?



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

హసన్‌పర్తి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు చేసుకుంటున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని గ్రామాల్లో చేసిన పనులకు ఎక్కువ మొత్తంలో కొలతలు వేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి అక్రమాలకు పాల్పడుతున్నారని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఫీల్డ్ అసిస్టెంట్ల ఇష్టారాజ్యంగా పనులు సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తమ వ్యక్తిగత పనులు కూడా ఉపాధి కూలీలతో చేయించుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యక్తిగత పనులు చేయించుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఓ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ తన ఇంటి నిర్మాణ పనులను ఉపాధి కూలీలతో చేయించినట్లుగా స్థానికంగా ప్రచారం జరుగుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో చెరువు తీసిన మొరాన్ని ఫీల్డ్ అసిస్టెంట్లు ఒక్కో ట్రాక్టర్ మొరం రూ.150 నుంచి రూ.200లకు విక్రయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ కరువు

పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ లోపం వల్ల ఫీల్డ్ అసిస్టెంట్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతీరోజు పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతాలకు వెళ్లి పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఎంతమంది పనులు చేస్తున్నారని మస్టర్‌ను పరిశీలించాలి. కొన్ని గ్రామాల్లో అసలు పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలోకి వెళ్లడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పారదర్శకంగానే పనులు..



ఉపాధి హామీ పనులు పారదర్శకంగా జరుగుతున్నాయి. పనులను ప్రతిరోజూ పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు. ఉపాధి బిల్లుల చెల్లింపులో ఎలాంటి అక్రమాలకు తావులేదు.

– ప్రవీణ్, ఎంపీడీఓ

చేతిపంపుల బాగుకు చిత్తశుద్ధి ఏది?



కాజీపేట - సోమిడి రోడ్డులో మూసివేసిన పంపు



పనిచేయని చేతిపంపును చూపుతున్న బాలిక

కాజీపేట: పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో నీటిని అందించే చేతిపంపుల నిర్వహణ గత కొంతకాలంగా అటకెక్కింది. చేతి పంపుల నుంచి వచ్చే నీటి వనరులను సద్వినియోగం చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారనడానికి పట్టణంలోని పలు కాలనీల్లో మరమ్మతుల పేరుతో మూలనపడిన చేతిపంపులే నిదర్శనం. చేతిపంపుల నిర్వహణకు ప్రభుత్వం తగినన్ని నిధులను విడుదల చేయకపోవడంతో వాటి నిర్వహణను గాలికొదిలేశారు. చేతి పంపులకు ముందస్తుగానే నిధులు విడుదలవుతున్నా మరమ్మతులకు గురైన నీటివనరులను బాగుచేయడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారు.

నిరుపయోగం

వేసవిలో భూగర్భ జలాలు తగ్గి తాగునీరిచ్చేందుకు మొరాయిస్తున్న చేతిపంపుల్లో పైపులు ఏర్పాటు చేయకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. వాటి మరమ్మతులకు శాశ్వత ఉద్యోగులు లేకపోవడంతో జాప్యం జరుగుతుండగా, అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సమస్య ఇంకా జటిలమవుతోంది. పట్టణంలో 65 చేతిపంపులుంటే మూడొంతులకు పైగా పని చేయనివే ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. అధికారులు స్పందించి చేతి పంపులను సకాలంలో వినియోగంలోకి తెస్తే తాగునీటి ఎద్దడిని కొంతవరకు అరికట్టవచ్చు. వేసవి కాలంలో ప్రజల అవసరాలకు సరిపడా నీరు దొరకని దుస్థితి నెలకొంది. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు స్పందించి పనిచేయని చేతిపంపులను గుర్తించి బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి



అవగాహన కల్పిస్తున్న వినోద్‌కుమార్

ఖిలా వరంగల్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు బలమైన ఆయుధమని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని సామాజిక న్యాయవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వరంగల్ ఫోర్ట్‌రోడ్డు విద్యానగర్ కాలనీలోని పలు వీధుల్లో చాణిక్య విద్యానికేతన్ హైస్కూల్ ఉపాధ్యాయులు, సామాజిక న్యాయ వేదిక ప్రతినిధుల ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ మంచి నేతను ఎన్నుకునే అవకాశం ఓటుతోనే వస్తుందని అన్నారు. అవినీతి రహిత ప్రభుత్వాలను ఎనుకునే అవకాశం తమ చేతుల్లోనే ఉందనే విషయాన్ని మర్చిపోవద్దని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయితీగా ఓటు వేసి మంచినేతను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రవీణ్, సంజన, వినోద, ఐలమ్మ, లచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణయ్యపై దాడిని ఖండించాలి

కాజీపేట: వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని ఆకాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ తెలిపారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రచారంలో ఉన్న కృష్ణయ్యపై దాడి చేసిన కూటమి దుండగులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఓటమి భయంతోనే దాడులకు తెగబడుతున్న వారిని శిక్షించాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీగా శేషగిరిరావును ఆదరించాలి

హసన్‌పర్తి: ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ఆధార్ పార్టీ అభ్యర్థి డాక్టర్ శేషగిరిరావును ఆదరించాలని ఆ పార్టీ వరంగల్ అధ్యక్షుడు గట్టు యుగంధర్ కోరారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని కోరారు. మొదటి ప్రాధాన్యత ఓటు శేషగిరిరావుకు వేయాలని విజ్ఞప్తి చేశారు.

బాధితులకు పరామర్శ

హసన్‌పర్తి: గుండెపోటుకు గురై మరణించిన వంగపహాడ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు మండల సాంబయ్య మృతదేహాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, లోక్ సభ అభ్యర్థి కడియం కావ్య ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, పీఏసీఎస్ చైర్మన్ మేర్గు రాజేష్, మాజీ కార్పొరేటర్ కల్పన, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అనిల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మార్త రవీందర్, మాజీ సర్పంచ్ రాజేందర్ యాదవ్ ఉన్నారు.

ఉచిత థైరాయిడ్ పరీక్షలు

హన్మకొండ చౌరస్తా: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకొని ఓటు వేసినట్లుగా సిరా చుక్కను చూపించి ఉచిత థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవాలని సిరి మెడికేర్ థైరోకేర్ ఫ్రాంచైజ్ మేనేజర్ చెట్లపెల్లి నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమ, మంగళవారాల్లో నగరంలోని ఏషియన్ శ్రీదేవి మాల్ ఎదురుగా ఉన్న సిరిమెడికేర్ థైరోకేర్ సెంటర్‌లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల ఉచిత థైరాయిడ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 98490 62827 నంబర్లలో సంప్రదించాలని నరేందర్ సూచించారు.

ప్రయోజకులను చేయాలని తల్లి తాపత్రయం



చంద్రకళను సన్మానిస్తున్న రాజేంద్రప్రసాద్

రామన్నపేట: పిల్లలు పుట్టినప్పటి నుంచి తల్లి అనేక ఆటుపోట్లను భరిస్తూ వారిని ఉన్నతులుగా తీర్చి ప్రయోజకులుగా చేసేందుకు అనేక త్యాగాలను చేస్తుందని రామన్నపేటలోని డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. మాతృదినోత్సవం సందర్భంగా నగరంలోని బ్యాంక్‌కాలనీలో నివాసం ఉంటున్న 85 ఏళ్ల వృద్ధురాలు బ్రహ్మదేవుల చంద్రకళను ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పిల్లలకు తల్లితో ఎక్కువ అనుబంధం ఉంటుందని అన్నారు. నేటి తరం పిల్లలు వారి తల్లిదండ్రులను వృద్ధాశ్రమం, అనాథాశ్రమంలో చేర్పిస్తూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలా చేస్తే భవిష్యత్‌లోనూ తమకూ అలాంటి దుస్థితే ఎదురైయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రహ్మదేవుల సోమలింగం, ట్రస్ట్ సభ్యులు మంతెన రాజేష్, వేణుగోపాల్, లలిత, సాయి మోహిత్, రజనీకాంత్, ప్రభావతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు భంగం కలిగిస్తే చర్యలు

- కాజీపేట ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి

కాజీపేట: ఎన్నికలకు ఎవరైనా భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వై.సుధాకర్ రెడ్డి హెచ్చరించారు. రాజకీయ పార్టీల ప్రచారం ముగిసిన నేపథ్యంలో కాజీపేట పోలీసుస్టేషన్‌లో ఆయన ఆదివారం 'సాక్షి'తో పలు అంశాలపై మాట్లాడారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేలా నగదు, మద్యం పంపిణీ చేసినా, బెదిరింపులకు పాల్పడినా చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా పోలీస్ నిఘా ఉంటుందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల కార్యకర్తలతో పాటు అనుచరులు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏ పార్టీ మద్దతుదారులైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని చెప్పారు. ఇప్పటికే పీఎస్ పరిధిలో వివాదాలు సృష్టించే అవకాశామున్న పలువురిని గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చామని, రౌడీషీటర్లను బైండోవర్ చేశామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేలా శాఖాపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అవాంఛనీయ సంఘటనలు జరిగిన వెంటనే స్పందించేలా ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. డివిజన్లలో వివాదాలు చోటు చేసుకున్నా, నగదు, మద్యం పంపిణీ చేస్తున్నా వెంటనే పోలీసులతో పాటు ఎన్నికల అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

శాయంపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి, శివమార్కండేయ ఆలయంలో శ్రీ ఏకాదశ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు ఆదివారం మూడో రోజు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భద్రకాళి దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి, శ్రీ పర్వత వర్ధని సమేత శివమార్కండేయ స్వామి, శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, పంచముఖ ఆంజనేయస్వామి, నాగదేవత విగ్రహాలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూలమంత్ర హవనం, హోమాలు నిర్వహించారు. శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, పర్వత వర్ధని సమేత శివ మార్కండేయ స్వామి కల్యాణ మహోత్సవాలను వేద మంత్రోచ్ఛరణాల మధ్య అంగరంగ వైభవంగా చేపట్టారు. అనంతరం హైకోర్టు న్యాయవాది మామిడి రూపేందర్ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు.

వాహనాల్లో సిబ్బంది, సామగ్రి తరలింపు



మార్కెట్ యార్డులో సిద్ధంగా ఉన్న బస్సులు



సామగ్రితో తరలివెళ్తున్న ఎన్నికల సిబ్బంది

ఖిలా వరంగల్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం, వీవీప్యాట్లు, ఎన్నికల సిబ్బందిని తరలించారు. వరంగల్ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వాహనాల కేటాయించినట్లు వరంగల్ రవాణాశాఖ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు జైపాల్‌రెడ్డి, శోభన్‌బాబు తెలిపారు. వరంగల్ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో వరంగల్ ఆర్టీఓ లక్ష్మి పర్యవేక్షణలో ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల ఓనర్స్ అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన వాహనాలను నియోజకవర్గాల వారీగా ఆదివారం కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా వర్ధన్నపేటకు 50, తూర్పునకు 46, నర్సంపేటకు 59 వాహనాలను కేటాయించినట్లు వివరించారు.

ప్రాణాంతకంగా ప్లాస్టిక్ వ్యర్థాలు





ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన డ్రెయినేజీలు

- న్యూశాయంపేటలోని డ్రెయినేజీల్లో దుర్వాసన

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం న్యూశాయంపేటలోని డ్రెయినేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి ప్రాణాంతకంగా మారుతున్నాయి. కాజీపేట – వరంగల్‌కు వెళ్లే దారిలోని న్యూశాయంపేట జంక్షన్‌లోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసనతో అనేక పాట్లు పడుతున్నారు. మురుగు నిల్వతో దోమలు వృద్ధి చెంది స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పాలకులు, అధికారులు అలసత్వం వహిస్తున్నారు.

బీజేపీ బూత్‌స్థాయి ఏజెంట్ల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్‌రావు

కాశిబుగ్గ: వరంగల్ ఓసిటీలోని ఎర్రబెల్లి ప్రదీప్‌రావు క్యాంపు కార్యాలయంలో వరంగల్ తూర్పు బీజేపీ పోలింగ్ బూత్ ఏజెంట్ల సన్నాహక సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారికి పోలింగ్ బూత్‌లో ఎలా ఉండాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు దిశానిర్దేశం చేశారు. ప్రతీ ఏజెంట్ పోలింగ్ బూత్‌లో ఎన్నికల కమిషన్ నియమ నిబంధలను అనుసరిస్తూ బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. సోమవారం ఓటింగ్ ప్రారంభమైన నుంచి చివరి వరకు ఈవీఎంలు సీల్ చేసి తీసుకెళ్లే వరకూ బూత్‌లో ఏజెంట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు రత్నం సతీష్ షా, పొట్టి శ్రీనివాస్ గుప్తా, బాకం హరిశంకర్, సిద్ధం నరేష్, ఏజెంట్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది



పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సామగ్రితో చేరుకున్న సిబ్బంది

మడికొండ: సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. 46, 64వ డివిజన్లలో 24 బూత్‌లలో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. కాజీపేట మండల పరిధిలోని మడికొండ పోలీసుస్టేషన్ పరిధిలోని అన్ని బూత్‌ల్లో సుమారుగా 30వేల మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు పోలీసు సిబ్బందిని పంపించినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ తెలిపారు.

శరవేగంగా గుండు చెరువు విస్తరణ





మధ్యకోట గుండు చెరువులో జరుగుతున్న పూడికతీత పనులు

- కొనసాగుతున్న విస్తరణ, పూడికతీత పనులు

ఖిలా వరంగల్: చారిత్రక మధ్యకోటలో సువిశాలమైన గుండు చెరువు విస్తరణ, పూడికతీత పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కుడా అధికారుల ఆధ్వర్యంలో ఏకశిల పార్కు నిర్వాహకుడి పర్యవేక్షణలో చెరువు విస్తరణ పనులు జరుగుతున్నాయి. గత 20 ఏళ్ల క్రితం చెరువు కట్టను అభివృద్ధి చేసి ఏకశిల చిల్డ్రన్ పార్కును ఏర్పాటు చేశారు. పార్కు నిర్వహణతో నెలకు రూ.లక్షల్లో ఆదాయం సమకూర్చి పెట్టిన అభివృద్ధి విషయంలో కుడా అధికారులకు పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. చారిత్రక కోటకు దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు మరింత ఉల్లాసం, ఆహ్లాదం అందించేలా దీర్ఘకాలిక అభివృద్ధి పనులు చేపట్టాలని, చెరువు చుట్టూ సముద్రపు బీచును తలపించేలా సుందరీకరణ పనులు చేపట్టాలని అధికారులకు చరిత్రకారులు విన్నవించారు. దాంతో కుడా అధికారులు స్పందించి నిధులు కేటాయించారు. కొన్ని రోజులుగా చెరువు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. చెరువు అభివృద్ధి పూర్తయితే మరింత అందాలు సంతరించుకుంటాయని పర్యాటకులు చెబుతున్నారు. చెరువులో పూడికతీత వెంటనే చేపట్టి గోదావరి జలాలతో నింపాలని, వర్షపు నీరు చెరువులోకి వచ్చేలా కాల్వల నిర్మాణం చేపట్టాలని ప్రజలు, పర్యాటకులు కోరుతున్నారు.

ముగిసిన శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు



హన్మకొండ కల్చరల్: హనుమకొండ రాగన్న దర్వాజ పెద్దకోవెలలోని హన్మద్గిరి శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో జరుగుతున్న శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. భగవద్రామనుజాచార్య స్వామి 1007 తిరునక్షత్రవాన్ని పురస్కరించుకుని 108 కలశాలతో అభిషేకం, వారికి విశేష పుష్పాలంకరణ, ఆలయ పురప్పాటు సేవలు, హెచ్చరికలు, తన్నియవిన్నపం అనంతరం తీర్థప్రసాదాల వితరణ చేశారు.